# గిరిజన బాలికల గురుకుల పాఠశాల తనిఖీ



దుర్కి గురుకుల పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం

బాన్సువాడ, జూన్ 23 : నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామ శివారులో ని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా.. విద్యాబోధన ఎలా ఉన్నదని ఆరా తీశారు. రెండు రోజులక్రితం రాత్రి విధి నిర్వహణలో పాఠశాల ఆవరణలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు మామిడి స్వప్న మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ దుర్గం శ్యామల వీరారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

**మౌలిక వసతుల కల్పనకు కృషి..**

బీర్కూర్ మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల ,కళాశాలలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి సోమవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి ప్రార్థన చేసి అనంతరం వారికి పాఠ్య పుస్తకాలు అందజేశారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సుమారు రూ.26 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీవో సత్యనారాయణ రెడ్డి, ఏఎంసీ దుర్గం శ్యామల శ్రీనివాస్, బోయిని శంకర్, చందు, బస్వరాజ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

**లబ్ధిదారులకు చెక్కుల అందజేత..**

బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, కోటగిరి, చందూర్, మోస్రా, పోతంగల్, రుద్రూర్ మండలాల్లోని 107 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 35 లక్షల 41 వేల రూపాయల విలువైన చెక్కులను సోమవారం అందజేశారు.

# కూలిన చెట్టు తొలగింపు

బాన్సువాడ రూరల్, జూన్ 23 : 'కూలిన చెట్టును తొలగించండి' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ' దినపత్రిలో ఆదివారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పదిరోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు, కురిసిన వర్షానికి అవాజ్‌పల్లి తండా అంగన్‌వాడీ కేంద్రం ఎదుట భారీ వృక్షం కూలిం ది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం గ్రామ కార్యదర్శి కార్మికులతో చెట్టును తొలగించేలా చర్యలు తీసుకున్నారు. కార్మికులు కటింగ్ మిషన్‌తో కూలిన చెట్టును అంగన్‌వాడీ కేంద్రం ముందు నుంచి తొలగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.




అవాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం ఎదుట కూలిన చెట్టును తొలగిస్తున్న కార్మికులు

## 28న జిల్లా స్థాయి ట్రయాథ్లాన్ సెలక్షన్స్

కామారెడ్డి, జూన్ 23 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఇందిరాగాంధీ స్టేడియంలో ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి ట్రయాథ్లాన్ సెలక్షన్స్ ఫర్ (అండర్ 10,12, 14 సంవత్సరాలు) బాలబాలికలకు సెలక్షన్స్ నిర్వహిస్తారని అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 మీటర్స్, లాంగ్ జంప్, హై జంప్, బ్యాక్‌త్రో, 600 మీటర్స్, జావలిన్‌త్రో, స్టాండింగ్ బోర్డు జంప్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనేవారు పుట్టిన రోజు సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

## అభివృద్ధి పనుల ప్రారంభం



లచ్చాపేట లో కుల సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి, జూన్ 23 : మండలంలోని రత్నగిరిపల్లి, ఘన్‌పూర్, కాకులగుట్టతండా, లచ్చాపేట గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బూస సురేశ్, జిల్లా సీనియర్ నాయకుడు పొన్నాల వెంకట్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి పండ్ల ప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, భరత్‌యాదవ్, రమేశ్, కిషన్‌గౌడ్, క్రాంతి, బాల్‌చంద్రం, ప్రభాకర్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

బీబీపేట్, జూన్ 22: ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని మండలంలోని అయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని అన్ని గ్రామాల గ్రామ పంచాయతీల్లో ఖర్చు చేసిన బిల్లుల డబ్బులను విడుదల చేసి ఆదుకోవాలని ఆయా గ్రామాల మాజీ సర్పంచులు కోరారు.

# ప్రజావాణికి ఫిర్యాదులు నిల్..



నాగిరెడ్డిపేటలో ప్రజావాణిలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు

నాగిరెడ్డిపేట, జూన్23: స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు, వసతిగృహాల వార్డెన్లు, ఇరిగేషన్‌శాఖ, ఐసీడీఎస్ శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా కేవలం తహసీల్దార్ శ్రీనివాస్‌తోపాటు ఎంపీడీవో ప్రభాకర్, వ్యవసాయ శాఖ ఏవో సాయి కిరణ్, ఐకేపీ ఏపీఎం జగదీశ్, వైద్యశాఖ నుంచి హెల్త్ సూపర్‌వైజర్లు మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు హాజరు కావడం లేదు. హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని చెప్పారు.

## మండల స్థాయి వ్యాస రచన పోటీలు

బాన్సువాడరూరల్, జూన్ 23 : మాదకద్రవ్యాల వాడకం ద్వారా కలిగే దుష్పరిణామాలు, వాటి నిర్మూలనపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ఎంఈవో నాగేశ్వర్‌రావు పర్యవేక్షించారు. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు మంగళవారం నిర్వహించే డివిజన్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డివిజన్‌స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 26న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## పట్టణానికి చేరుకున్న పాదయాత్ర



లక్ష్మీపతి స్వామీజిని కలిసిన విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

కామారెడ్డి, జూన్ 23 : విశ్వశాంతి సమాజ ఉన్నతిని కాంక్షిస్తూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన లక్ష్మీపతి స్వామీజీ పాదయాత్ర చేస్తున్నారు. ఈ పాదయాత్ర సోమవారం కామారెడ్డి పట్టణానికి చేరుకున్నది. ఆయన శరీరంపైన దేవతలు, గుళ్లు, గోపురాలతో పచ్చబొట్టు పొడిపించుకొని 2016లో పాదయాత్ర ప్రారంభించి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల గుండా పాదయాత్ర చేస్తూ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య వరకు పాదయాత్ర చేసినట్లు ఆయన తెలిపారు. ఆయనను పట్టణంలోని స్థానిక గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కలిశారు. జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, కార్యదర్శి రాజు, ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్ రావు, గోపాలకృష్ణ, వైద్యుడు వెంకట్, సీతారామారావు ఉన్నారు.

## స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలి



బాన్సువాడలోని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాన్సువాడ, జూన్ 23 : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో ప్రభుత్వానికి చెందిన పదిశాతం స్థలాన్ని కబ్జాచేసి, ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ ప్రకాశ్‌పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మద్నూర్, జూన్ 23 : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అబ్కారి ఎస్సై నగేశ్ అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వ్యసనం చావకముందే చనిపోయేలా చేస్తుందని, ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**బీబీపేట్‌లో..**

బీబీపేట్, జూన్ 22: మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చైతన్యం కల్పించాలని ఎక్సైజ్ ఎస్సై దీపిక అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మాదకద్రవ్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై నగేశ్

## ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

బాన్సువాడ రూరల్, జూన్ 23 :ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు సిఫారసు చేస్తామని ఎంఈవో నాగేశ్వర్‌రావు ప్రైవేటు పాఠశాలల యాజమన్యాలను హెచ్చరించారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమన్యాలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల ప్రాంగణంలో పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు విక్రయించరాదన్నారు. అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అడవి పందులు



బెజ్గాం చెరువు తండా శివారులో అడవి పందుల దాడిలో ధ్వంసమైన మక్కజొన్న పంటను చూపుతున్న రైతు

నాగిరెడ్డిపేట, జూన్ 23: మండలంలోని బెజ్గాం చెరువు తండా శివారులో మక్కజొన్న పంటపై సోమవారం తెల్లవారుజామున అడవిపందులు దాడి చేసి ధ్వంసం చేసినట్లు బాధిత రైతు బాబూనాయక్ తెలిపారు. గ్రామ శివారులో రెండు ఎకరాల్లో మక్క జొన్న పంట వేసుకొని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామనీ తెల్లవారుజామున అకస్మాతుగా అడవి పందుల గుంపు దాడి చేసి రెండు గుంటల పంటను పూర్తిగా నేలమట్టం చేసి పనికి రాకుండా చేసిందన్నారు. అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

## భవిత భవనంలో ఫిజియోథెరపీ శిబిరం




దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్స నిర్వహిస్తున్న ఫిజియోథెరపిస్ట్ అరుణ్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 23: పట్టణంలోని భవిత భవనంలో సోమవారం ఫిజియోథెరపిస్ట్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు దివ్యాంగ చిన్నారులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ వెంకటేశం పాల్గొన్నారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD**
**ABR NO. 41 OF 2025**
**Between:**
Jashu Chit Fund Pvt.Ltd Kamareddy represented by its Branch Manager Mr.D.Krishna Hari
.... Disputant
And
G.Bheem Raj and Others
... Opponents
To
**Opp.No.1:** G.Bheem Raju S/o. Shankaraiah, aged about 32 Years, Occ: Private Employee, R/o. H.No.4-99, Vill: Baswannapally, Mdl: Rajampet, Dist. Kamareddy.
**Opp. No.2.** G.Dayakar S/o. Ramreddy, aged about 35 years, Occ: P.E.T., R/o.H.No4-12, Vill: Argonda, Mdl: Rajampet, Dist. Kamareddy.
**Opp. No.5** Smt.K.Sunitha W/o. Bheem Raju aged about 30 years, Occ:House Wife R/o. H.No.4-99 Vill: Baswannapally, Mdl: Rajampet, Dist. Kamareddy.
The Disputant has filed the dispute for recovery of amount and notices sent on your addresses are returned unserved. Whereas the dispute is posted for your appearance on 02.07.2025 at 11.00 A.M. You are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits/ Arbitrator, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte.
**// By order of the Deputy Registrar of Chits/ Arbitrator//**
**Sd/- Deputy Registrar of Chits/ Arbitrator, Kavitha Complex, Nizamabad.**

# శ్రమదానం చేయాలని అధికారుల ఆదేశం

**నిరాకరించిన ఆశ కార్యకర్తలు..**

లింగంపేట, జూన్ 23: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని వైద్యశాఖ అధికారులు ఆదేశించగా పనులు చేయడానికి ఆశ కార్యకర్తలు నిరాకరించారు. మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చంద్రశేఖర్ సందర్శించారు. దవాఖాన పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించడంతో పలువురు ఆశ కార్యకర్తలు శ్రమదానం చేశారు. రెండోరోజు అధికారులు ట్రాక్టర్‌తో చదును చేయించారు. ట్రాక్టర్ వెళ్లలేని ప్రదేశాల్లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని సోమవారం దవాఖాన సిబ్బంది ఆశ కార్యకర్తలకు సూచించారు. దీంతో వారు శ్రమదానం చేయడానికి నిరాకరించారు. గ్రామస్థాయిలో ఆశ కార్యకర్తలకు పని భారం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దవాఖాన సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో సబ్ సెంటర్లలో స్వీపర్లు లేని కారణంగా తామే శుభ్రం చేసుకుంటున్నామని, తిరిగి పీహెచ్‌సీలో సైతం మొక్కల తొలగింపు పనులు అప్పగించి పని భారం మోపడం సరికాదన్నారు. శ్రమదానం పని భారం నుంచి తమను మినహాయించాలని కోరారు. సోమవారం పలువురు ఆశ కార్యకర్తలు పీహెచ్‌సీ వైద్యురాలికి వినతి పత్రం అందించారు. ఈ విషయమై స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు రాంబాయిని వివరణ కోరగా మూడు రోజుల క్రితం జిల్లా వైద్య శాఖ అధికారి వచ్చిన సమయంలో ఆయన ఆదేశాల మేరకు దవాఖాన సిబ్బంది, ఆశ కార్యకర్తలు కలిసి ట్రాక్టర్ సాయంతో ఆవరణ శుభ్రం చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ తిరగని ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలగించాలని ఆశ కార్యకర్తలకు సూచించగా వారు శుభ్రం చేయడానికి నిరాకరించారని, కూలీలను ఏర్పాటు చేసి ఆవరణ శుభ్రం చేయించనున్నట్లు వివరించారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వచ్చిన సమయంలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఆశ కార్యకర్తలు (ఫైల్)

## ఉపాధి పనులపై విచారణ



బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో విచారణ చేపడుతున్న అధికారులు

లింగంపేట(తాడ్వాయి), జూన్ 23: తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులపై విచారణ చేపడుతున్నట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు వెల్లడించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాచారెడ్డి, జూన్ 23 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్సై అనిల్ సోమవారం తెలిపారు. భవానీపేట గ్రామం నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇసుకను తరలించినట్లయితే రెవెన్యూ అధికారుల పర్మిషన్‌తో పాటు ట్రాక్టర్‌కు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఇసుకను తరలించాలని ఎస్సై సూచించారు. పర్మిషన్ లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పోసానిపేట్‌లో చోరీ



పోసానిపేట్‌లో ఇంట్లో వస్తువులను చిందరవందరగా పారేసిన దొంగలు

రామారెడ్డి, జూన్ 24 : మండలంలోని పోసానిపేట్ గ్రామంలో బట్టు బాల్‌రాం అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఎస్సై రాజారాం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బట్టు బలరాం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సదాశివనగర్ మండలం మోడెగామ గ్రామానికి శుభ కార్యానికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉన్నది. బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, 15 తులాల వెండిని దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి



బాయంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నాగిరెడ్డిపేట/ ఎల్లారెడ్డి రూరల్/ రామారెడ్డి (సదాశివ నగర్)/లింగంపేట, జూన్ 23: గ్రామాల్లో ప్రజలకు ఉన్న సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని అచ్చయపల్లి గ్రామంలో సోమవారం రాత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, సురేందర్‌గౌడ్, శ్రీరాంగౌడ్, మురళీగౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, మండల, పట్టణ అధ్యక్షులు కుర్మ సాయిబాబా, వినోద్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గణపతి, ఉషాగౌడ్, మల్లేశ్ తదితరులున్నారు.

రామారెడ్డి(సదాశివనగర్), జూన్ 23 : సదాశివనగర మండలం వజ్జేపల్లి గ్రామంలో ఉత్నూర్ నుంచి వజ్జేపల్లి వరకు నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మర్కంటి లింగాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యానాయక్, ఇర్షాద్, భాగయ్య తదితరులు పాల్గొన్నారు. లింగంపేట మండలంలోని బాయంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అన్నారెడ్డిపల్లి, లింగంపేట గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

## గెస్టు ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి (సదాశివనగర్),జూన్ 23 : సదాశివనగర్ మండలం మర్కల్ మల్లన్న గుట్ట గురుకుల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, హిస్టరీ విభాగాల్లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి 26న డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారికి 32 వేల రూపాయల వేతనం అందజేస్తారని పేర్కొన్నారు.

## ఎస్బీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

బాన్సువాడ, జూన్ 23 : బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దాతలు 101 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంవో సుజాత మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బాన్సువాడ శాఖ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, స్టేట్ బ్యాంక్ ఫీల్డు ఆఫీసర్ శంకర్ గౌడ్, పీఆర్వో ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్లు రాఘవేందర్, ఏబీ నైజర్, సూర్యకాంత్, శ్రీనివాస్, యువకులు పాల్గొన్నారు.



బాన్సువాడ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు, బ్యాంకు అధికారులు

# విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేసిన దాతలు

ఎల్లారెడ్డిరూరల్, జూన్ 23: విద్యార్థుల భవిష్యత్తు పాఠశాల గదిలోనే నిర్మాణమవుతుందని దాతలు అన్నారు. మండలంలోని మల్లాయిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కుటుంబ సభ్యుడు తోట దత్తు పాఠశాలకు చెందిన 32మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. సఫ్దల్‌పూర్ గ్రామ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన యువకుడు నాయికోటి చందు స్కూల్‌బ్యాగ్‌లను అందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, రమ్య పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డిరూరల్, జూన్ 23: మండలంలోని తిమ్మాపూర్ తండాకు చెందిన నేనావత్ రవికుమార్ ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో సోమవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. ప్రభుత్వ దవాఖానకు చేరుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, తండావాసులు రోదించడం పలువురిని కలిచివేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ వారిని ఓదార్చి, వారికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

## మాడల్‌హౌస్ స్లాబ్ పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట మాడల్‌హౌస్ స్లాబ్ నిర్మాణంలో బొంబాయి పెంకలను ఏర్పాటు చేస్తున్న డీఈఈ సుభాష్

నాగిరెడ్డిపేట, జూన్ 23: మండల పరిషత్ కార్యాలయ స్థలంలో నిర్మిస్తున్న మాడల్‌హౌస్ నిర్మాణ స్లాబ్ పనులను సోమవారం హౌసింగ్ శాఖ డీఈఈ సుభాష్ పరిశీలించారు. స్లాబ్ చెక్కలపై బొంబాయి పెంకలను ఏర్పాటు చేయించారు. దానిపై స్లాబ్ వేయాలని కాంట్రాక్టర్ రవీందర్‌రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లర్ రూఫింగ్ విధానం ద్వారా స్లాబ్ వేస్తున్నట్లు చెప్పారు. స్లాబ్ వేయడానికి ముందు బొంబాయి పెంకలను ఏర్పాటు చేసి స్లాబ్ వేస్తే లోపలి భాగం పైకప్పు పెంకులకు కలర్‌తో రూఫ్ వేయడం ద్వారా పెంకుటింటిలో ఉన్నట్లు ఉంటుందన్నారు. ఈ విధానం తెలంగాణలో తొలిసారిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట ఎంపీడీవో ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.